క్లుప్తంగా

వాసుబాబును కలిసిన నెరుసు చిరంజీవి



వాసుబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నెరుసు చిరంజీవి

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాబోయే రోజుల్లో పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి పటిష్టతకు కృషి చేయాలని ఉంగుటూరు సమన్వయకర్త పుప్పాల వాసుబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నెరుసు చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు జిల్లాలో బీసీ సామాజిక వర్గానికి సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్ గురునాథ్, ఏలూరు నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి షేక్ బాజీ (గాజుల బాజీ) తదితరులున్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గారపాటి చౌదరి

ఏలూరు (టూటౌన్): అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ పటిష్టానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ అన్నారు. ఏలూరు అంబికా టవర్స్‌లో నిర్వహించిన ఏలూరు జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అధ్యక్షతన బీజేపీ జిల్లా పదాధికారులు, నూతన మండల అధ్యక్షుల సమావేశంలో మధుకర్ జీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గారపాటి చౌదరి మాట్లాడారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, నాయకులు నిర్మల కిషోర్, కృష్ణ ప్రసాద్, శరణాల మాలతీ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి ప్రై‘వేటు’

- కార్లు, ఆటోల్లో ప్రయాణికుల తరలింపు
- రోజుకు రూ.లక్షకు పైగా ఆదాయానికి గండి
- ఏలూరు డిపోలో సుమారు 150 బస్సులు
- నిత్యం 12 వేల మంది ప్రయాణం



ఏలూరు పాత బస్టాండు వద్ద ఉన్న ప్రయాణికుల ఆటోలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా కేంద్రమైన ఏలూరు నుంచి అనేక రూట్లలో ఆర్టీసీ బస్సులు నిత్యం వేలాది మందిని తమ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, రాజమండ్రి, రావులపాలెం, తెలంగాణ ప్రాంతానికి చెందిన సత్తుపల్లి, చింతలపూడి, ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రం, జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమవరం పాలకొల్లు, నరసాపురం ఇలా వివిధ మార్గాల్లో బస్సు సర్వీసులు ఉన్నాయి. అయినప్పటికీ ప్రయాణికుల రవాణా అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు తిప్పలేకపోవడంతో చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు మినీ బస్సులు, ఆటోలు, కార్లతో ప్రయాణికులను తరలిస్తుండడంతో ఆశించిన ఆదాయాన్ని ఆర్టీసీ ఆర్జించలేకపోతోంది.

నిత్యం 12 వేల మంది రాకపోకలు

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి నిత్యం సుమారు 12 వేల మందిని తమ గమ్య స్థానాలకు చేరుతున్నారు. జిల్లా కేంద్రం కావడంతో ఏలూరు పరిసర ప్రాంతాల్లోని వివిధ మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు సైతం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, జిల్లా కోర్టు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఆయా కార్యాలయాల్లో పనులు చూసుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలు, మండల కేంద్రాల నుంచి ఏలూరుకు వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటుంది. వీరిలో అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు.

నిబంధనలకు విరుద్ధంగా రవాణా

ఆర్టీసీ బస్టాండుకు కనీసం 500 మీటర్లలోపు ప్రైవేట్ వాహనం నిలపకూడదని, ప్రయాణికులను తరలించకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో ప్రైవేట్ వాహనాల జోరు కొనసాగుతోంది. ఆర్టీసీ ఏలూరు డిపో నుంచి నిత్యం విజవాడకు 23 నాన్‌స్టాప్ బస్సులు తిప్పుతున్నారు. విజయవాడకు ఉన్న డిమాండ్‌ను ప్రైవేట్ వాహనాలు కూడా సొమ్ము చేసుకుంటున్నాయి. సుమారు 10 మంది పట్టే టవేరా వాహనాలు ఏలూరు కొత్త బస్టాండు వద్ద పెట్టి, ప్రయాణికులను తరలిస్తున్నారు. తాడేపల్లిగూడెం వెళ్లే ప్రయాణికులను ప్రైవేట్ మినీ బస్సుల్లో తరలిస్తున్నారు. పెదపాడు, దెందులూరు, కొవ్వలి వంటి రూట్లలో ఆర్టీసీ బస్సులు పెద్దగా తిప్పకపోవడంతో ఆయా రూట్లలో ఆటోల వారిదే రాజ్యంగా మారింది. ఇలా ప్రైవేట్ వాహనాల దందా కారణంగా ఏలూరు ఆర్టీసీ డిపో రోజుకు సుమారు రూ.లక్షకు పైగానే నష్టం వాటిల్లుతుందని అంచనా.

డిపోలో 150 బస్సులు

ఏలూరు ఆర్టీసీ డిపోలో సుమారు 150 బస్సులు ఉన్నాయి. వీటిలో 44 అద్దె బస్సులు ఉన్నాయి. వీటి ద్వారా ఏలూరు డిపోకు నిత్యం సుమారు రూ.20 లక్షల ఆదాయం వస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, విజయవాడ నాన్‌స్టాప్‌లు, మచిలీపట్నం, గుడివాడ, ద్వారకాతిరుమల, రాజమండ్రి రూట్లలో తిప్పే బస్సుల ద్వారానే అధిక ఆదాయం వస్తుంది. పెదపాడు, దెందులూరు వంటి ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ పెద్దగా ఉండని కారణంగా ఎక్కువ బస్సులు తిప్పడంలేదు. విజయవాడ, తాడేపల్లిగూడెం వంటి ప్రాంతాలకు ప్రయాణికుల నుంచి మంచి డిమాండే ఉంది. ఈ మార్గాల్లో ప్రయాణికులను ప్రైవేట్ వాహనాల్లో తరలించడాన్ని కట్టడిచేస్తే ఏలూరు డిపోకు మరికొంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం



కొత్త బస్టాండు వద్ద ప్రైవేట్ వాహనాలు, మినీ బస్సులను నిలపకుడా, ప్రయాణికులను తరలించకుండా ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ద్వారా కట్టడి చేస్తున్నాం. పాత బస్టాండు వద్ద ఆటోలకు కూడా అడ్డుకట్ట వేస్తున్నాం. ఆయా వాహనాలను నిరోధించడానికి పోలీసుల సాయం తీసుకుంటున్నాం. ఆర్టీసీ బస్టాండుల వద్ద నుంచి ప్రయాణికులను తరలించే ప్రైవేట్ వాహనదారులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– బి.వాణి, మేనేజర్, ఆర్టీసీ ఏలూరు డిపో

మాల భవన్ నిర్మాణ పనులు పునరుద్ధరణ



గోడ నిర్మాణం చేపట్టిన నాయకులు

సాక్షి ఎఫెక్ట్

ఏలూరు (టూటౌన్): ఏలూరు నియోజకవర్గంలోని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి గ్రహణం శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య స్పందించారు. స్థానిక అమీనా పేట ఏటిగట్టు ప్రాంతంలో మాల భవన్ నిర్మాణం పూర్తికి తన వ్యక్తిగత నిధులు రూ.లక్ష అందించారు. ఈ సొమ్ముతో మాల భవన్ గోడల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ నిధుల నుంచి రూ.40 లక్షలు తమ భవన్ గ్రాంటుగా ప్రకటించారని చెప్పారు. గురువారం చేపట్టిన నిర్మాణ పనులను మాలమహానాడు సీనియర్ నాయకులు మెండెం ఆనంద్, లంకపల్లి మాణిక్యాలరావు, కాపు దాసి రవి, దిలీప్, టి.సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి 5 నామినేషన్లు

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన దిడ్ల వీరరాఘవులు, కాకినాడకు చెందిన కాట్రు నాగబాబులు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వికి అందజేశారు. అభ్యర్థులతో వెట్రిసెల్వి ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఎన్నికల విభాగం తహసీల్దార్ చల్లన్న దొర తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌కు ప్రదర్శనగా పీడీఎఫ్ అభ్యర్థి

ఏలూరు (టూటౌన్): ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు (డీవీ రాఘవులు) స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకు అందజేశారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం వద్ద బహిరంగ సభ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వర్లు, బొర్రా గోపి మూర్తిలు మాట్లాడారు. పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.





నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్‌ఓ, కలెక్టర్ వెట్రిసెల్వి, నామినేషన్ అందిస్తున్న డీవీ రాఘవులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిములను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశం ఎర్రా రాంబాబు అధ్యక్షతన ఏలూరు సీఐటీయూ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించారు. రమణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అయినపర్తి మాధవ, తోట నాగు, రెడ్డి లక్ష్మణరావు, పి.శ్రీనివాసు, కటికలు శ్రీనివాసు, పరస శ్రీనివాస్, బి.రెడ్డి, పరస రాజేష్, చీర అప్పారావు తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

భీమడోలు: నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఆశా డేలో భాగంగా ఈనెల 10న నేషనల్ డీవార్మింగ్ డేను పురస్కరించుకుని వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లుకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో శ్రీలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతకు ప్రధాన కారణం నులిపురుగులేనని చెప్పారు. వీటి నిర్మూలనకు ఈనెల 10న 83 అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో 19 ఏళ్లలోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలను మింగిస్తామన్నారు. మండల పరిధిలోని 11,355 మంది బాలబాలికలు, యువతీ యువకులు ఉన్నాయన్నారు. ఈనెల 10న మాత్రలు మింగని వారికి 17న అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఆర్ జాహ్నవి, సీహెచ్‌ఓ కె.ఇందిరా, సూపర్‌వైజర్లు నవీనా, డి.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎల్‌ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



డీవార్మింగ్ డేపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి శ్రీలక్ష్మి

ముగిసిన క్రీస్తు సువార్త సభలు

భీమడోలు: గుండుగొలనులోని కృపా క్షేత్రంలో నిర్వహిస్తున్న 4 రోజుల నిర్వహించిన 49వ ఏసు క్రీస్తు సువార్త మహాసభలు బుధవారం రాత్రి ముగిశాయి. అంతర్జాతీయ దైవజనులు పాకల పాటి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రసంగీకులు జాన్‌వెస్లీ, జ్యోతిరాజు, డేవిడ్‌లు దైవ సందేశాలను అందించారు. బుధవారం రాత్రి దైవజనులు జెర్మియా మాట్లాడుతూ బైబిల్‌లో ఎందరో ఆరంభంలో శక్తివంతులుగా, రాజులుగా ఉన్నా వారి జీవితం ఎంతోదయనీయంగా ముగిసిందన్నారు. బైబిల్‌లో దావీదు ఒక్కరే ఆరంభం కన్నా ముగింపు రెట్టింపు ఆశీర్వాదాన్ని కలిగి ఉన్నారని వివరించారు. ఆయన దేవుని ఎడల చూపిన విశ్వాసాన్ని ప్రతిఒక్కరూ చూపాలని సూచించారు. జాన్‌వెస్లీ బృందం చక్కని గీతాలను ఆలపించారు.పాస్టర్ పాకలపాటి యోహాన్, సత్యకృప, రాష్ట్ర నలుమూలల నుంచి దైవజనులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక మానసిక వికాసం

గణపవరం(ఉంగుటూరు): యోగాభ్యాసంతో శారీరక మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ టి.విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం ఉంగుటూరు ప్రభుత్వ కాలేజీలో వ్యాయామ విభాగం, తెలుగుశాఖ, సహజ యోగసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 45 రోజుల యోగ సర్టిఫికెట్ కోర్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోగా సాధనతో మానసిక, శారీరక సమతుల్యత ఏర్పడుతుందని, అనేక రోగాలు నివారణ అవుతాయని వివరించారు. ముఖ్యఅతిథి ఆంధ్రప్రదేశ్ స్టేట్ సహజయోగ కమిటీ సభ్యుడు కె.రామకృష్ణ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి యోగులు యోగసాధన ద్వారా ఆనందంగా, ఆరోగ్యంగా 100 సంవత్సరాలు జీవించారని, వారికి వారసులుగా మనం యోగాసాధన చేయాలని సూచించారు. ఎ.హనుమంతరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. సహజయోగ కోఆర్డినేటర్ శ్రీమతి విజయలక్ష్మి, ఎంసుకుమార్ పాల్గొన్నారు.



డిగ్రీ కాలేజీలో యోగ సాధన చేస్తున్న దృశ్యం

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	03
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - తిరుపతి	16.00	4830	27
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	32
వంకాయలు (కాంతులు)	24	బీన్లచిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32-44	బీట్‌రూట్	32
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44


భక్తిశ్రద్ధలతో కృత్తిక నక్షత్ర పూజలు



దత్త సుబ్రహ్మణ్య స్వామి

ఏలూరు (ఆర్ఆర్ పేట): కృత్తిక నక్షత్ర పర్వదినం సందర్భంగా నగరంలోని దొండపాడు శ్రీ సందత్తనాథ క్షేత్రంలో గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం దత్త సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో పాల కావడి సేవ నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, అలంకరణ, ఆరాధన పూజలు చేశారు. దత్తసుబ్రహ్మణ్య స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం దీపోత్సవ సేవ నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. క్షేత్రం అర్చకులు గంటసాల రామకృష్ణ విశేష పూజలు నిర్వహించగా, క్షేత్రం వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా అమర్ శ్రీనివాస్



అమర్ శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): స్థానిక స్పెషల్ కోర్టు ఫర్ ట్రైల్ ఆఫ్ అఫెన్సెస్ అండర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏలూరుకు చెందిన న్యాయవాది వాసర్ల అమర్ శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు ఈ హోదాలో కొనసాగనున్నారు. శ్రీనివాస్ ఏలూరు సీఆర్‌ఆర్ కాలేజీలో లా పట్టా పొందారు. 1993 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. 2014 నుంచి 2017 వరకు ఏలూరు బార్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు న్యాయవాదులు ప్రశంసించి శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు సర్వే ఫీవర్

- 40 శాతంపైగా పింఛన్ల తొలగింపే లక్ష్యమా?
- కక్షగట్టిన కూటమి సర్కార్
- ఆందోళనలో లబ్ధిదారులు



భీమడోలులో వికలాంగునికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమడోలు: దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు కూటమి సర్కార్ సర్వం సిద్ధం చేసింది. 40 శాతం పైగా లబ్ధిదారులు అనర్హులని, వీరి పింఛన్లు తొలగించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించేందుకు ప్రత్యేక సర్వే సాకుతో వైద్య బృందాలను ఇళ్లకు పంపిస్తుంది. దీంతో ఏన్నో ఏళ్లగా సదరం ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల గుండెల్లో గుబులు మొదలైంది. ఎన్నికల సమయంలో పింఛన్ల సొమ్ము పెంచుతామని చెప్పిన కూటమి నాయకులు నేడు అనర్హుల పేరుతో ఏరివేత చేపట్టడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

రూ.15 వేలు తీసుకునే వారే టార్గెట్

మంచం పట్టిన, కుర్చీలకే పరిమితమైన వికలాంగులకు పింఛన్ సొమ్ము రూ.15 వేలకు పెంచారు. ఆరు నెలల పాటు పెంచిన సొమ్ము అందించిన కూటమి ప్రభుత్వం పింఛన్లలో అక్రమాలు జరిగాయని, బోగస్ పింఛన్లు ఏరివేయాలని లబ్ధిదారులకు షాకిచ్చింది. మంచానికే పరిమితమైన లబ్ధిదారుల ఇళ్లకు వైద్య బృందం వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై నివేదికలను తయారీ చేసి సంబంధిత వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు. కన్ను, చెవి ఇతర సమస్యలు గల లబ్ధిదారులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపి అక్కడ పరీక్షలు చేయించారు. పరీక్షల సమయంలో లబ్ధిదారులు నరకయాతన అనుభవించారు. పింఛనే జీవనాధారంగా ఉన్న లబ్ధిదారులు పింఛన్ రాకపోతే బతికేదెలా అని ఆందోళన చెందుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో లబ్ధిదారుల ఆరోగ్య పరీక్షల సర్వే పూర్తిచేశారు.

నేటికీ వితంతు పింఛన్ లేదే?

సాధారణంగా రేషన్ కార్డులోని భర్త వృద్ధాప్య పింఛన్ పొందుతూ మృతి చెందితే, భర్త డెత్ సర్టిఫికెట్ ఆధారంగా భార్యకు వెంటనే వితంతు పింఛన్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందేది. నేడు కూటమి సర్కార్ జూన్ నుంచి అక్టోబర్ వరకు చనిపోయిన వృద్ధులైన భర్తల పింఛనును వారి భార్యలకు ఇప్పటి వరకు ఇవ్వలేదు. నవంబర్‌లో మృతి చెందిన వారికే వితంతు పింఛన్ అందుతోంది. ఇది లబ్ధిదారుల చావుకు.. నెలలకు సంబంధమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.



ఆర్జావారిగూడెంలో దివ్యాంగుల వివరాలు సేకరిస్తున్న వైద్యులు

ఉంగుటూరు నియోజకవర్గంలో..

మండలం	లబ్ధిదారులు
భీమడోలు	61
ఉంగుటూరు	80
నిడమర్రు	44
గణపవరం	80

నిబంధనల మేరకే పరీక్షలు



గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని 41 మంది మంచానికే పరిమితమైన దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక వైద్యులు పరీక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వారిని పరీక్షించారు. వీరి నివేదికలను జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాం. అర్హత గల లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన లేదు.

– కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, గుండుగొలను

అర్హులకు నష్టం కలిగించొద్దు



దివ్యాంగుల పట్ల ప్రభుత్వం సానుకూలతను చూపాలి. సదరం ధ్రువీకరణ పత్రాలున్న వారికి వెసులుబాటు ఇవ్వాలి. అర్హులకు నష్టం జరగకుండా చూడాలి. ఎవరికీ అన్యాయం జరగదనే అనుకుంటున్నాం. ఈ సర్వేలతో వారంతా బాధపడుతున్నారు. అనర్హులను తొలగిస్తే ఇబ్బంది లేదు.

– మామిడిపల్లి నాగభూషణం, ఏలూరు జిల్లా అధ్యక్షుడు, వికలాంగుల పోరాట హక్కుల సమితి